

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,45,522లు. బంగారం 1గ్రాము 150 మిల్లీగ్రాములు. వెండి 56 గ్రాములు 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాష్ట్రంలో జేఎన్‌-1 జాడ లేదు

రాష్ట్రంలో ప్రస్తుతం ఒమిక్రాన్‌ సబ్‌ వేరియంట్‌ జేఎన్‌-1 జాడ లేదని రాష్ట్ర ఆరోగ్య సేవల శాఖ డైరెక్టర్‌ బిజయ్‌ కుమార్‌ మహాపాత్రో స్పష్టం చేశారు.

- 8లో



విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్‌ అధ్యక్షుడు గవర తిరుపతిరావు అన్నారు.

- 8లో

విజృంభిస్తున్న డెంగీ..?



హౌసింగ్‌ బోర్డులో నిలిచిపోయిన వర్షపు నీరు




ఎంకేసీజీ డెంగీ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

- బరంపురం నగరంలో పెరుగుతున్న కేసులు
- ఎంకేసీజీలో చికిత్స పొందుతున్న పలువురు
- దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌

బరంపురం: నగరంలో అధికారుల నిర్లక్ష్యంతో గతేడాది రికార్డు స్థాయిలో విజృంభించిన డెంగీ మరలా కోరలు విప్పుతోంది. గత కొద్ది రోజులుగా నగరంలోని వివిధ వార్డుల్లో నివసిస్తున్న ప్రజలు డెంగీ వ్యాధికి గురై స్థానిక ఎంకేసీజీ మెడికల్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం అంకులికి చెందిన ఒక మహిళ జ్వరంతో బాధపడుతూ ఎంకేసీజీ ఆస్పత్రిలో చేరగా రక్త పరీక్షల్లో ఆమెకు డెంగీ నిర్ధారణ అయినట్లు జిల్లా మలేరియా అధికారి ఉమా శంకర్‌ మిశ్రా తెలియజేశారు. ఇదేవిధంగా కొద్ది రోజుల నుంచి వరుసగా జ్వరం, తలనొప్పి, కాళ్ల, చేతుల పీకులతో బాధపడుతూ అనేక మంది ఆస్పత్రిలో చేరుతున్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

కాలువల్లో పూడికలు

బరంపురం మున్సిపల్‌ కార్పొరేషన్‌లో ప్రస్తుతం విపరీతంగా దోమలు పెరగడంతో డెంగీ వ్యాధి విజృంభణకు కారణమైంది. కాలువల్లో పూడిక తీయకపోవడంతో ప్రస్తుతం నగరంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కడ చూసిన మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమలను అరికట్టడంతో జిల్లా ఆరోగ్య వ్యవస్థ, బీఎంసీ నిర్లక్ష్యం వహిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు.



చేతల్లో చూపాలి

అంటు రోగాలు వ్యాపిస్తున్న సమయంలో ఆలస్యంగా మేలుకొని హడావుడి చేయడం ప్రభుత్వ అనవాయితీగా మారింది. వాస్తవానికి దోమల నిర్మూలన, వ్యాధుల నివారణకు చిత్తశుద్ధి, కార్యదీక్ష ఉండాలి. కానీ వట్టి మాటలు, కాగితాల సంతకాలు కాదు. ప్రస్తుతం డెంగీ కేసులు రోజూ పెరిగిపోతున్నాయి. కానీ అధికారుల చర్యలు అంతగా కనిపించడం లేదు.



పేరుకుపోయిన చెత్తకుప్పలు

న్యూస్‌రీల్‌

జగన్నాథుని ముఖ అలంకారం నేడు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథుని ముఖ అలంకరణ బుధవారం జరగనుంది. మార్గశిర శుక్ల అష్టమి తిథి పురస్కరించుకుని శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరి నిత్య పూజలందుకుంటున్న మూల విరాటుల ముఖ అలంకరణ (బొనొకొ లగ్గి) చేపట్టనున్నారు. ద్వితీయ భోగ మండప సేవ అనంతరం ఈ అలంకరణ ప్రారంభిస్తారు. గోప్యంగా నిర్వహించే ఈ సేవ సుదీర్ఘంగా సుమారు 4 గంటలపాటు నిరవధికంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులకు తాత్కాలికంగా సర్వ దర్శనం నిలిపివేయనున్నట్లు శ్రీ మందిరం అధికార వర్గాలు తెలిపాయి.

ఘొడొ లగ్గి ప్రారంభం



శీతల వస్త్రధారణలో బ్రహ్మగిరి అలరనాథ్‌

భువనేశ్వర్‌: మార్గశిర మాసం ఒఢొణి షష్టి పురస్కరించుకుని పూరీ జిల్లా బ్రహ్మగిరి అలరనాథ స్వామికి శీతల (ఉన్ని) వస్త్రధారణ మంగళవారం ప్రారంభించారు. చలి నుంచి రక్షణ కల్పించేందుకు ముఖం తప్ప శరీరమంతా పట్టు వస్త్రాలతో కప్పి ప్రత్యేక వస్త్రాలతో అలంకరణ చేశారు. మధ్యాహ్న ధూపదీపానంతరం ఈ అలంకరణ చేశారు. అలారనాథునితో పాటు పార్శ్వ దేవతలు లక్ష్మీ, సరస్వతీ ఇతర దేవతలకు ఘొడొ లగ్గి చేయడం విశేషం. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక మిఠాయి కకరా నైవేద్యంగా సమర్పిస్తారు. భక్తులకు ఈ అలంకరణలో సర్వ దర్శనం కల్పించారు. మాఘ మాసం శ్రీ పంచమి ముందు రోజు వరకు ఈ అలంకరణలో భక్తులకు దర్శనం ఉంటుంది. శ్రీ పంచమి రోజున భక్తులకు అలారనాథుని నిజరూపం దర్శనం లభిస్తుంది.

విజి'లెన్స్‌'



విజిలెన్స్‌కు చిక్కిన ఆర్‌ఐ విజయ్‌ కుమార్‌

జయపురం: లమతాపుట్‌ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌, అతడి ప్యూన్‌లు విజిలెన్స్‌ వలకు చిక్కారు. భూమిని గుర్తించడానికి లంచం తీసుకుంటుండగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ విజయ కుమార్‌ బాగ్‌ను విజిలెన్స్‌ సిబ్బంది రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భూమి సరిహద్దులు గుర్తించడానికి లమతాపుట్‌ సమితి మాలెంగ గ్రామానికి చెందిన హరి నాయక్‌ నుంచి రూ.10 వేల లంచం డిమాండ్‌ చేశారు. దీంతో ఆయన విజిలెన్స్‌ అధికారులను సంప్రదించాడు. ప్లాన్‌లో భాగంగా ఆర్‌ఐకు మంగళవారం లంచం ఇస్తుండగా విజిలెన్స్‌ అధికారులు పట్టుకున్నారు. అలాగే విజిలెన్స్‌ టీమ్‌లు మూడు ప్రాంతాల్లో దాడులు జరుపుతున్నట్లు తెలిసింది. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దివ్యాంగుల ట్రై సైకిల్‌ పోటీలు



పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

రాయగడ: చొయితి క్రీడోత్సవాల్లో జిల్లా పోలీసు యంత్రాంగం దివ్యాంగుల ట్రై సైకిల్‌ పోటీలను మంగళవారం నిర్వహించింది. స్థానిక కొరాపుట్‌ కూడలిలో జరిగిన ఈ పోటీల్లో 13 మంది పాల్గొన్నారు. ఏఎస్పీ బిష్ణుచరణ్‌ పాత్రో, జిల్లా క్రీడాశాఖ అధికారి షేక్‌ అలీనూర్‌ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో కొరాపుట్‌ కూడలి నుంచి కిలోమీటరు దూరం వరకు పోటీ లక్ష్యాన్ని నిర్ధారించారు. పోటీల్లో అభిరాం కొరొకొరియా ప్రథమ, నీలకంఠం ద్వితీయ, సుందరు కౌసల్య తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పలువురు అభినందనలు తెలిపారు.



బహుమతులతో విజేతలు

విరాళాలకు కాంగ్రెస్‌ ఆహ్వానం

- ఈనెల 28 వరకు సేకరణ
- ఒడిశా ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు శరత్‌ పట్నాయక్‌



మాట్లాడుతున్న ఓపీసీసీ చీఫ్‌ శరత్‌ పట్నాయక్‌

భువనేశ్వర్‌: వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రంలో నిధుల సేకరణ కోసం కాంగ్రెస్‌ దేశం కోసం విరాళం ప్రచార కార్యక్రమం మంగళవారం ప్రారంభించింది. జాతీయ స్థాయిలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఈ ప్రచారం జరుగుతుందని ఒడిశా ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు శరత్‌ పట్నాయక్‌ తెలియజేశారు. అఖిల భారత కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ ఖర్గే న్యూఢిల్లీలో ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. పార్టీ 138వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28వ తేదీ వరకు దేశం కోసం విరాళం కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన వారి నుంచి కనీసం రూ.138 లేదా రూ.1,380 లేదా రూ.13,800 వంటి గుణిజాలు విరాళాలు అందజేయాలని పార్టీ కోరినట్లు శరత్‌ పట్నాయక్‌ తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ 138 సంవత్సరాల పూర్తికి ప్రతీకగా కనీస విరాళం రూ.138 నిర్ధారించినట్లు పేర్కొన్నారు.

సర్టిఫికెట్‌ జారీ

విరాళం చెల్లించిన వారికి జాతీయ కాంగ్రెస్‌ అధ్యక్షుడు సంతకం చేసిన సర్టిఫికెట్‌ జారీ అవుతుందని శరత్‌ పట్నాయక్‌ తెలియజేశారు. ప్రచారంలో భాగంగా పార్టీ అన్నివర్గాల దాతల నుంచి విరాళం స్వీకరిస్తుంది. దేశ నిర్మాణంలో కాంగ్రెస్‌ సామాన్యుల సాయం కోరడం ఇదే తొలిసారిగా పేర్కొన్నారు. అన్ని రాష్ట్ర యూనిట్లు విలేకరుల సమావేశాలు, సోషల్‌ మీడియా ద్వారా అవగాహన పెంపొందించాలని కోరారు. పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు ప్రతీ బూత్‌లో కనీసం రూ.138 లేదా అంతకంటే ఎక్కువ విరాళాల కోసం కనీసం పది ఇళ్ల నుంచి చేరుకోవాలని లక్ష్యంగా నిర్ధారించారు. ఈ ప్రచారం 1920–21లో మహాత్మాగాంధీ యొక్క తిలక్‌ స్వరాజ్‌ నిధి ప్రేరణగా సంకల్పించడం జరిగిందని వివరించారు. పేదలు, షెడ్యూల్డ్‌ కులాలు, వెనుకబడిన వారి ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌ ఇప్పటికే పని చేస్తోందన్నారు. దేశం కోసం విరాళం ద్వారా సాధారణ ప్రజల నుంచి సహాయాన్ని తీసుకుని దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఎప్పుడూ సాధారణ ప్రజల నుంచి సాయం అందుతుందని వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తారని తెలిపారు. సామాన్యుల నుంచి విరాళాలు సేకరించి ప్రజల సహాయ సహకారాలతో పేదల కోసం పోరాడే పార్టీ కాంగ్రెస్‌ ఒక్కటేనని ప్రజలకు భరోసా ఇస్తున్నామని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు ముందరి భాగం



ప్రమాద స్థలంలో ద్విచక్ర వాహనాలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని పెట్రోల్‌ బంక్‌ వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. బంక్‌ వద్ద అతివేగంగా వస్తున్న ఒక కారు అదే రోడ్డుపై వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొనడంతో పాటు ఒక ఇంటి గోడను ఢీకొంది. దీంతో కారు డ్రైవర్‌, రెండు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వ్యక్తులు, కారులో ఉన్నటువంటి మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. విషయం తెలిసిన పోలీసు ఐఐసీ రీగాన్‌ కీండో సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

తీర్థయాత్రకు 970 మంది వృద్ధులు



సమావేశంలో పాల్గొన్న మంత్రి సరక, దాస్‌, సామంతరాయ్‌ తదితరులు

రాయగడ: వృద్ధులకు తీర్థయాత్రలో భాగంగా 970 మంది వృద్ధులను షిరిడీ, నాసిక్‌ పుణ్య తీర్థాలకు ప్రభుత్వం తరుపున మంగళవారం పంపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలును రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక స్థానిక రైల్వేస్టేషన్‌లో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తీర్థయాత్రలు చేయడం వలన ఆధ్యాత్మిక అనుభూతి పొందడంతో పాటు వారికి భిన్న భాషా, సంస్కృతులు తెలుసుకునే అవకాశం లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందరి సంక్షేమ కోసం నిరంతరం పనిచేస్తుందని తెలియజేశారు. ఎంతోమంది తీర్థయాత్రలను చేయాలనుకున్నా ఆర్థికంగా వెసులుబాటు కాకపోవడంతో వెళ్లలేకపోతున్నారని, అలాంటి వారి కోసమే ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్‌ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఎస్డీసీ చైర్మన్‌ అనసూయా మాఝి, బిజు స్వస్థ్య సమితి ముఖ్యసలహాదారుడు సుధీర్‌ దాస్‌, రాయగడ మున్సిపాలిటీ చైర్మన్‌ మహేష్‌ పట్నాయక్‌ తదితరులు పాల్గొన్నారు. కాగా తీర్థయాత్రల్లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వృద్ధులకు స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు.



జెండా ఊపి రైలు ప్రారంభిస్తున్న మంత్రి సరక



రైల్వేస్టేషన్‌కు చేరుకున్న వృద్ధులు

గజపతి ఉత్సవాలు ప్రారంభం



జ్యోతిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న అధికారులు

పర్లాకిమిడి పట్టణంలోని గజపతి స్టేడియంలో గజపతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా స్థానిక జగన్నాథ మందిరం వద్దనున్న గజపతి జ్యోతిని కలెక్టర్‌ స్మృతిరంజన్‌ ప్రధాన్‌, ఏడీఎం రాజేంద్ర మింజ్‌ తదితర అధికారులు పురవీధుల్లో ఊరేగించారు. దీనిలో భాగంగా ప్రదర్శించిన సాంప్రదాయ సవర నృత్యాలు, తీన్‌మార్‌ బ్యాండ్‌, చంద్రగిరి టిబెటియన్‌ నృత్యం, బెబర్తావీధి సమరవీరుల కత్తిసాములు ఆకట్టుకున్నాయి. స్టేడియంలో సాయంత్ర సమయంలో మంత్రి జగన్నాథ సరక గజపతి ఉత్సవాలను ప్రారంభించారు. ఆయనతో పాటు జిల్లా పరిషత్‌ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఎస్‌డీసీ చైర్మన్‌ మరియం రైతో తదితరులు ఉన్నారు.

– పర్లాకిమిడి



జ్యోతి ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు



చంద్రగిరి టిబెటియన్‌ చౌడప్ప వాద్యం



ఒడిస్సీ సవర సాంప్రదాయ నృత్యం



పర్లాకిమిడి మహారాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్‌ స్మృతి రంజన్‌ ప్రధాన్‌ తదితరులు

ఉత్కళ క్యాంపస్‌లో కారు దగ్ధం

భువనేశ్వర్‌: స్థానిక ఉత్కళ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో కారు దగ్ధమైంది. క్యాంపస్‌లో మంగళవారం జరిగిన ఈ ఘటన బెంబేలెత్తించింది. ప్రజా గ్రంథాలయం ఆవరణలో నిలిపిన కారులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందడంతో అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరి మంటలను అదుపుచేసింది. కారులో షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

• వినతిపత్రం అందజేత



స్థానిక రాజ్‌ భవన్‌లో విపక్షాల కూటమి 'ఇండియా' ప్రతినిధుల బృందం గవర్నర్‌ రఘుబర దాస్‌తో మంగళవారం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా పార్లమెంట్‌ సమావేశాల్లో 141 మంది సభ్యులను సభ నుంచి సస్పెండ్‌ చేయడాన్ని ఈ వర్గం వ్యతిరేకించింది. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రపతి పేరుతో గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు.

- భువనేశ్వర్‌

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీపీటీఓ


డీపీటీఓ టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: ప్రయాణికుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా ఆర్టీసీ అహర్నిశలు కృషి చేస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని కార్యాలయంలో డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో ప్రజారవాణా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు తమ పరిధిలో సమస్యలను ఫోన్ 9959225605 నంబర్‌కు కాల్ చేసి తెలపవచ్చని సూచించారు.

ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధం



కాలుతున్న స్కూటీ,(ఇన్‌సెట్లో) బూడిదైన స్కూటీ

సీతంపేట: స్థానిక ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న పెద్దింటి అప్పలనాయుడుకు చెందిన ఎలక్ట్రికల్ స్కూటీ మంగళవారం ఉదయం దగ్ధమైంది. ఎప్పటిలాగానే ఇంటివద్ద స్కూటీకి చార్జింగ్ ఉదయం 8 గంటలకు పెట్టగా 9 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వచ్చి కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళన చెంది వెంటనే వచ్చి అదుపు చేశారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు నిందితులను టూటౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ ఎస్.హెచ్. విజయానంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలానికి చెందిన పసల రాజేష్, సమ్మోతు గణేష్‌లు ఒడిశాలోని సిమిలిగూడలో అమిత్ ఖోస్లా, మనోజ్ సబర్‌ల దగ్గర కిలో రూ.200 చొప్పున గంజాయిని కొనుగోలు చేసి నలుగురు వస్తుండగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన టూటౌన్ పోలీసులు నిఘా పెట్టి స్థానిక జేఎన్‌టీయూ, గిరిజన యూనివర్సిటీ సమీపంలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కిలోల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్‌లు, ఒక మోటార్ సైకిల్ రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

- జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి


జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌ల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. వారిలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఏపీఎస్ఆర్‌టీసీ రీజినల్ బోర్డు చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఏపీ క్రియేటివ్, కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ వంగపండు ఉష ఉన్నారు. ప్రభుత్వం తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకూ వీరంతా పదవుల్లో కొనసాగనున్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి జీసీసీ ద్వారా కృషి చేయడానికి మరోసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఒక గిరిజన బిడ్డగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి పేర్కొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పార్వతీపురం టౌన్: స్థానిక బెలగాం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతిచెందాడు, ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్‌పీ సిబ్బంది గుర్తించారు. విశాఖపట్నం నుంచి రాయగడ వెళ్లే మార్గమధ్యంలో రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలిసినవారు పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్‌లోని జీఆర్‌పీ కార్యాలయంలో సమాచారం అందించాలని జీఆర్‌పీ సిబ్బంది కోరారు.

రాష్ట్రంలో జేఎన్-1 జాడ లేదు




- కోవిడ్‌పై అప్రమత్తంగా ఉన్నాం
- సమయానుకూలంగా మార్గదర్శకాలు జారీ
- రాష్ట్ర ఆరోగ్య సేవల శాఖ డైరెక్టర్ బిజయ్ కుమార్ మహాపాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రస్తుతం ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్-1 జాడ లేదని రాష్ట్ర ఆరోగ్య సేవల శాఖ డైరెక్టర్ బిజయ్ కుమార్ మహాపాత్రో స్పష్టం చేశారు. దేశంలో కోవిడ్ కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పరిస్థితులపై ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని పేర్కొన్నారు. జేఎన్-1 ప్రభావం ఉన్నట్లయితే సమయానుకూలంగా మార్గదర్శకాలు జారీ చేయవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో కోవిడ్ రోగుల చికిత్స కోసం తగినన్ని పడకలు, అనుబంధ చికిత్స, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కోవిడ్ సంబంధిత లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

అవసరమైతే మర్గదర్శకాలు

కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కోవిడ్ కేసులు పెరుగుతుండడంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సోమవారం రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. రాబోయే పండుగల హడావుడి దృష్టిలో ఉంచుకుని కోవిడ్ సంక్రమణ వైపరీత్యం నివారించాలని స్పష్టం చేశారు. అయితే కేంద్రం ఆదేశం మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ సాంకేతిక కమిటీ ఈ మేరకు చర్చిస్తోందని బిజయ్ కుమార్ వెల్లడించారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తుందన్నారు. కొత్త వేరియంట్ ఆవిర్భావంపై గట్టి నిఘా కొనసాగుతోందని స్పష్టం చేశారు.

ఇదివరకు మాదిరిగా పరీక్షలు

చాలా కాలంగా జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారికి గతంలో మాదిరిగానే కోవిడ్ పరీక్షలు చేస్తారు. ఇప్పటివరకు రాష్ట్రంలో కొత్త వేరియంట్ జాడ లేదు. కొత్త వేరియంట్ తారసపడితే జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం సిఫారసు చేస్తారు. ప్రస్తుతానికి ఈ కొత్త వేరియంట్ తీవ్రతపై ఎటువంటి సమాచారం లేదు. తీవ్రమైన పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధమై ఉందని తెలిపారు. కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం తగినంత పరీక్ష కిట్లు, ఇతర సరంజామా అందుబాటులో ఉంది. కాబట్టి ఏదైనా లక్షణాలు ఉన్న వ్యక్తులు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ఆయన తెలిపారు. ఆరోగ్య శాఖ ఇప్పటికే సిబ్బంది, పడకలు, మందులతో అన్ని రకాల సన్నాహాలు చేయగా మరిన్ని ముందస్తు ఏర్పాట్లలో తలమునకలై ఉందన్నారు. జలుబు, దగ్గు ఉన్నవారు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలని ఆరోగ్య శాఖ కోరింది. ఈ పరిస్థితుల్లో జలుబు, జ్వరం వచ్చినా ఇంటి నుంచి బయటకు రాకూడదు. ఈ లక్షణాలు ఉంటే విహారయాత్ర వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో 260 కొత్త కరోనా వైరస్ కేసులు కనుగొనబడ్డాయి. క్రియాశీల కేసులు 1,828కి పెరిగాయి.

ఘనంగా జిల్లా ఐక్య క్రిస్మస్ వేడుక


దైవ సందేశాన్ని అందజేస్తున్న దైవవర్తమానికులు డాక్టర్ జుహానీ హాలోనన్

విజయనగరం టౌన్: సర్వమానవాళికి క్రీస్తు బోధనలు అనుసరణీయమని పార్లమెంట్ మాజీ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా ఐక్య క్రిస్మస్ వేడుకలు స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్స్‌లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ యేసే లోకరక్షకుడని, ఆయన అందరికీ సమాధానం కలుగజేస్తాడన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వర్‌కౌశిక్ మాట్లాడుతూ క్రీస్తు ప్రేమ విశ్వమంతటికీ ఆదర్శనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విక్రమ్ క్యాండిల్ వెలిగించారు. డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అతిథులతో కలిసి కేక్ కట్ చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. డాక్టర్ జుహానీ హాలోనన్ దైవ వర్తమానాన్ని అందజేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డాక్టర్ ఎం. ఐసాక్ గ్రీటింగ్స్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. బిషప్ ఎం.పాల్సన్, రెవరెండ్ ఎస్.మధు, రెవరెండ్ పి.ప్రేమానందం, రెవరెండ్ ఉదయ చంద్ర తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ నాసిర్, పీటీసీ ప్రిన్సిపాల్ టి. ఆనందబాబు, డాక్టర్ ఎం.శశిభూషణరావు, రెవరెండ్ డి.ఎలీషా, డాక్టర్ చార్లీ టామ్, ఎల్.మధుసూదన్, జయప్రకాశ్, ఎన్.జాన్, జి.శ్రీధర్, యబ్బాజు చౌదరి, బి.ఆనంద్, పట్నాల పైడిరాజు, అధిక సంఖ్యలో దైవజనులు, విశ్వాసులు పాల్గొన్నారు.

21న ఓటరు జాబితా పరిశీలకుడి రాక

విజయనగరం అర్బన్:

జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి జె.శ్యామలరావు ఈ నెల 21న తేదీన గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఆయన కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని ఓటర్ల జాబితా విషయమై విన్నవించదలుచుకున్న ప్రజలు ఆయనను కలెక్టరేట్‌లో కలవవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీఅనిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక సమ్మరీ రివిజన్-2024లో భాగంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను అక్టోబర్ 27న ప్రచురించి జాబితాను జిల్లాలో గల అన్ని రాజకీయ పార్టీలకు సరఫరా చేశామని తెలిపారు. ఈ జాబితాకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించామని వివరించారు.

పుస్తెలతాడు చోరీ

జామి: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఉపాధిహామీ క్షేత్రసహాయకురాలు వేచలపు సత్యవతి మెడలోని పుస్తెలతాడు చోరీకి గురైంది. వివరాలిలా ఉన్నాయి. బంధువుల ఇంటికి మంగళవారం స్కూటీపై అలమండ వెళ్లి తిరిగి జామి కార్యాలయానికి వస్తున్న సమయంలో రామయ్యపాలెం సమీపంలో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి అరకు వెళ్లేందుకు ఆమెను అడ్రస్ అడిగారు. అంతలో వెనుకనుంచి ఓ దుండగుడు ఆమె మెడలోని పుస్తెలతాడు లాక్కున్న అనంతరం ముగ్గురూ బైక్‌పై పరారయ్యారు. రెండున్నర తులాల బంగారం పుస్తెలతాడు చోరీకి గురైనట్లు బాధితురాలు జామి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

తెలంగాణలో బొబ్బిలి వాసుల మృతి

బొబ్బిలి: తెలంగాణలోని సంగారెడ్డిలో లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో బొబ్బిలి మండలం దిబ్బగుడివలసకు చెందిన తల్లీకొడుకులు మృతి చెందారు. గ్రామానికి చెందిన కొట్నాన సత్యనారాయణ పదేళ్ల క్రిందట ఉపాధి కోసం సంగారెడ్డి వెళ్లిపోయాడు. అక్కడ ఫార్మా కంపెనీలో పని చేస్తుండగా నాలుగేళ్ల క్రితం మండలంలోని రాజుపేటకు చెందిన మహేశ్వరితో వివాహమైంది. వారికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. హైదరాద్‌లోని వారి బంధువుల ఇంటికి సత్యనారాయణ, భార్య మహేశ్వరి, కుమారుడు దేవాన్ష్ బైక్‌పై వెళ్తుండగా వెనుకనుంచి లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మహేశ్వరి, దేవాన్ష్ మృతి చెందగా సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎస్‌డీఎస్ కళాశాల విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని ఎస్‌డీఎస్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలో సెకెండ్ బీఎస్సీ చదువుతున్న జి.వాసు ఆంధ్రయూనివర్సిటీ తరఫున అథ్లెటిక్స్ విభాగంలో రేస్‌వాక్‌లో పాల్గొని బంగారు పతకం సాధించి జాతీయస్థాయి ఇంటర్ వర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడు. తమిళనాడులో జరగనున్న జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నాడు. అదేవిధంగా తృతీయ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న సీహెచ్.బాలరాజు ఆంధ్ర యూనివర్సిటీ తరఫున ఖోఖో పోటీలకు పురుషుల విభాగంలో ఎంపికయ్యాడు. కేరళరాష్ట్రంలోని కాలికట్ యూనివర్సిటీలో జరగనున్న సౌత్ ఇండియన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ప్రతిభ కనబరిచిన ఈ క్రీడాకారులను కళాశాల ప్రతినిధులు టి.కమలాకరరావు, బి.రవి, సురేష్, బి.శ్రీనివాసరావులు అభినందించారు.

ఆమెకే బాధ్యతలు

- మహిళా సంఘాలకు జేజేఎం పనుల బాధ్యత
- క్యాబినెట్ నిర్ణయంతో కుళాయి పనులకు మోక్షం


మహిళా సంఘాల సభ్యులు

విజయనగరం గంటస్తంభం: మహిళా శక్తిని గుర్తించిన ప్రభుత్వం వారిని అడుగుడుగునా ప్రోత్సహిస్తూ ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలోని నాడు నేడు పనులను మహిళా సంఘాలకు అప్పగించిన ప్రభుత్వం తాజాగా జలజీవన్ మిషన్ పనులు కూడా వారికే అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనలకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో కుళాయి పనులకు మోక్షం కలగడమే కాకుండా మహిళలు ఆర్థికంగా బలోపేతం కానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల్‌జీవన్ మిషన్ పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు విజయనగరం జిల్లాలో రూ.900 కోట్లతో 2411 పనులు మంజూరయ్యాయి. ఇప్పటికే జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పథకంలో మంచినీటి పథకాలు, పైప్‌లైన్ల ఏర్పాటు, ఇంటింటి కుళాయిల నిర్మాణం జరుగుతోంది.

743 పనులకు ఖరారు కాని టెండర్లు

జిల్లాలో మంజూరైన జల్‌జీవన్ మిషన్ పనుల్లో కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమై పనులు పూర్తికాగా, మరికొన్ని మధ్యలో ఉన్నాయి. తొలివిడత కింద 1111 పనులు మంజూరుకాగా, రెండో విడత కింద 1300 పనులు మంజూరయ్యాయి. ఈపనులు కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టాలని ప్రభుత్వం ముందుగా నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా అధికారులు టెండర్లు ఆహ్వానించారు. తొలివిడత మంజూరైన పనుల్లో 1048 పనులకు కాంట్రాక్టర్లు టెండర్లు వేసి పనులు ప్రారంభించారు. రెండో విడతలో 680 పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఇందులో కూడా చాలావరకు పనులు ప్రారంభమై జరుగుతున్నాయి. అయితే మిగతా పనులకు కాంట్రాక్టర్లు టెండర్లు వేయలేదు.

టెండర్లు ఖరారు కాని పనుల అప్పగింత

జల్‌జీవన్ మిషన్‌లో టెండర్లు ఖరారు కాని పనులను మహిళా సంఘాలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాడు నేడు పథకం కింద పాఠశాలల్లో చేపడుతున్న పనులు చాలా వరకు మహిళా సంఘాలకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ పనులను వారు విజయవంతంగా అప్పగించారు. ఈ క్రమంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ పద్ధతిలో మహిళా సంఘాలకు జల్‌జీవన్ మిషన్ పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. అంతేకాకుండా ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదం కూడా తెలిపింది. దీంతో అధికారులు పనులు వారికి అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నారు. పార్ట్ ఎ కింద వారితో కుళాయిలు వేయించడం, పైప్‌లైన్ పనులు చేపట్టనున్నారు. పార్ట్ బి కింద పెద్ద పనులు కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. ఈ మేరకు జిల్లాలో 620 పనులు మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న మహిళా సంఘాల సభ్యులను జలసంఘాలుగా ఏర్పాటు చేసి వారి ద్వారా పనులు నిర్వహించనున్నారు. తద్వారా మహిళాసంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం కానున్నారు.

విధివిధానాలు రావాల్సి ఉంది

జల్‌జీవన్ మిషన్ పథకంలో కొన్ని పనులు మహిళా సంఘాల ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపింది. మహిళా సంఘాల ఆసక్తిని ముందే తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా వారికి అప్పగించాలని నిర్ణయం తీసుకుంది. అయితే పూర్తిస్థాయి విధివిధానాలు జీవో రూపంలో రెండుమూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది.

– ఉమాశంకర్, ఎస్ఈ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, విజయనగరం

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



అధ్యాపకురాలికి పురస్కారం అందజేస్తున్న తిరుపతిరావు

పర్లాకిమిడి: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు అన్నారు. స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి (స్వయం ప్రతిపత్తి) డిగ్రీ కళాశాల వార్షిక వేడుకలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ ఒడిశా – నవీన్ ఒడిశా నినాదంతో క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్నేహ ప్రభా పండా, దీప్తిరాణి పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

మేడపై నుంచి జారిపడి వ్యక్తి మృతి


అటల్ బిహారి హొత్త (ఫైల్)

రాయగడ: ప్రమాదవశాత్తు మేడపై నుంచి జారిపడి తీర్థయాత్రల కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న అటల్ బిహారి హొత్త (49) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. స్థానిక బిజూ కల్యాణ మండపంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. మృతుడు నవరంగపూర్ జిల్లాలోని సనొమోసిగా గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వృద్ధులకు తీర్థయాత్ర పథకంలో భాగంగా నవరంగపూర్ జిల్లా నుంచి 146 మంది వృద్ధులు రాయగడకు చేరుకున్నారు. ఈ క్రమంలో వీరి బాగోగులు చూసుకునేందుకు ఆరుగురు కో–ఆర్డినేటర్లను నియమించారు. వీరంతా రాయగడకు సోమవారం చేరుకోగా స్థానిక బిజూ కల్యాణ మండపంలో విశ్రాంతి తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో అదేరోజు రాత్రి హొతా ఏదో పని మీద మేడపైకి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి కిందికి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

జేఎన్‌టీయూ జీవీ మహిళా జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: రాజమండ్రి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ పోటీల్లో స్త్రీల విభాగంలో పాల్గొననున్న జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) జట్టు జాబితాను యూనివర్సిటీ మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేవెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల యూనివర్సిటీ అనుబంధ కళాశాల విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ విశాఖ కళాశాల క్రీడామైదానంలో జరిగిన అంతర యూనివర్సిటీ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు ప్రతిభ చూపడంతో వారంతా జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ఎంపికైన వారు వీరే..

జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ మహిళా జట్టుకు ఎంపికైన వారిలో ఎం.లక్ష్మీశ్రీ సౌమ్య (విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దువ్వాడ, విశాఖ), ఎస్.కె.రిజ్వానా ఖతున్ (రఘు ఇంజినీరింగ్ కాలేజ్ ఎ, విశాఖ), పి.డింపుల్ హనీషా (విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, దువ్వాడ, విశాఖ), ఇ.జ్ఞాన ప్రసన్న (విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్, విశాఖ), ఎస్.జస్మిత (విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ, విశాఖ) ఉన్నారు. ఎంపికైన జట్టు సభ్యులను వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏవీపాపారావు, స్పోర్ట్స్ డైరెక్టర్స్ డాక్టర్ కె.నాగరాజు, ఎం.ఎల్లారీశ్వరి అభినందించారు.

దైవసేవ కన్నా మిన్న..

దివ్యాంగులకు సేవ


ట్రస్టు ఆధ్వర్యంలో తయారు చేస్తున్న కృత్రిమ అవయవాల గురించి వివరిస్తున్న చైర్మన్ జగదీష్‌బాబు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివసరావు

కొత్తవలస: దివ్యాంగులకు సేవ చేయడాన్ని దైవ సేవ కన్నా ఎక్కువగా భావించాలని, వారిని ఎప్పుడూ భారంగా అనుకోకూడదని, అన్ని రంగాల్లో వారికి ప్రాధాన్యం కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టులో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలిమ్ కో, జిల్లా అధికార యంత్రాంగం సంయుక్తంగా చేపట్టిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కోసం గుర్తింపు శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ముందుగా గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కృత్రిమ అవయవాల తయారీ, ఫిజియోథెరపీ తదితర కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని హితవు పలికారు. దివ్యాంగులకు గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎనలేని సేవలు అందుతున్నాయని ప్రశంసించారు. దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు గుర్తింపు శిబిరాలను ప్రతి ఆరునెలలకు ఒకసారి నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దివ్యాంగులకు ప్రముఖ స్థానం కల్పించాలి

అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులను దేవాతామూర్తులుగా చూడాలని పిలుపునిచ్చారు. వారికి మనోధైర్యం కల్పించి సమాజంలో అన్ని రంగాల్లో ప్రముఖ స్థానం కల్పించాలని కోరారు. దివ్యాంగుల సేవకే గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తన జీవితాన్ని అంకితం చేశారని ప్రశంసించారు. ఉపకరణాలు అందించేందుకు నిర్వహించిన ఈ శిబిరంలో వెయ్యిమందిని గుర్తించినట్లు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఎ.డి జగదీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి భాస్కరరావు, రవికుమార్, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య, రామస్వామి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, కేవీ సూర్యనారాయణ రాజు(పులిరాజు) తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీఎం పుట్టిన రోజు వేడుకలు విజయవంతం చేయాలి

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా నెల 21న జిల్లా వ్యాప్తంగా సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులన్నీ సీఎం జన్మదిన వేడుకల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాలని సూచించారు . అలా గే రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాలు చేపట్టాలని కోరారు. అనాథ, వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీఎం జన్మదిన వేడుకలు చేపట్టనున్నామని, 10 గంటలకు అందరూ చేరుకోవాలని కోరారు.

సుడా చైర్మన్‌గా ఆశాలత కొనసాగింపు


ఆశాలత గుప్త

నరసన్నపేట: శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా కోరాడ ఆశాలత గుప్తను కొనసాగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 2021వ సంవత్సరం ఆగస్టు 12 న మొదటి సారి ఆశాలత గుప్తను చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పదవీ కాలం పూర్తి కావడంతో మళ్లీ ఆమెనే కొనసాగించారు. సుడా చైర్మన్‌గా మళ్లీ అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐటెప్ కోర్సులో 22న స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రారంభించిన నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాంలో మిగులు సీట్లకు ఈ నెల 22న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ చెప్పారు. వర్సిటీలో ఆయన మంగళవారం వివరాలు వెల్లడించారు. బీఏ+బీఎడ్ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్), బీఎస్సీ+బీఎడ్ (మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) డిగ్రీల్లో ఈ ప్రవేశాలు ఉంటాయని అన్నారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ కౌన్సెల్ ఎడ్యుకేషన్ టెస్ట్ -2023లో అర్హత సాధించి ఉండాలని అన్నారు. 22వ తేదీన ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించి, అనంతరం అర్హత ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని అన్నారు. ఏడాదికి ఫీజు స్ట్రక్చర్ రూ. 18,000 కాగా, స్పాట్ అడ్మిషన్లకు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వర్తించవని స్పష్టం చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని వినతి


మంత్రిని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావును బా ర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు అధ్యక్షతన మంత్రిని కలిసి సమస్యలు వివరించారు. జీఓను పరిశీలించి చట్టసవరణకు ప్రయత్నిద్దామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు పొన్నాడ రాము, గేదేల వాసు, సనపల హరి, పొన్నాడ వెంకటరమణ, ఎం.కృష్ణంరాజు ఉన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ అధికారి ఇ.అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హతలు కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు బీసీ స్టడీ సర్కిల్, వాంబే కాలనీ, 80 ఫీట్ రోడ్, టీడీపీ భవనం వెనుక, శ్రీకాకుళంలో గల కార్యాలయంలో లభిస్తాయని పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టి.సి.), కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని సూచించారు. వివరాలకు 8332852106, 7382975679 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొనుగోల్ దాటాల్సిందే..!



రైతులకు ఇబ్బంది లేకుండా..



ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణతో పాటు రైతులకు పూర్తిన్యాయం జరిగేలా కల్లంలో ధాన్యం సేకరణ నుంచి నగదు చెల్లింపుల వరకు అన్ని స్థాయిల్లో పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నాం.

– కె.శ్రీనివాస్, జిల్లా మేనేజర్, సివిల్ సప్లయి కార్పొరేషన్, శ్రీకాకుళం

- జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలుకు చర్యలు
- మొత్తం 626 ఆర్‌బీకేల్లో కొనుగోలుకు ఏర్పాట్లు
- వారం రోజుల్లో ధాన్యం డబ్బులు చెల్లింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ ఏడాది లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కళ్లం నుంచి ధాన్యం రవాణా, మద్దతు ధర చెల్లింపు, సకాలంలో నగదును వారి ఖాతాల్లో జమ చేసేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది జిల్లాలో 260 మిల్లులకు ధాన్యం అందజేస్తున్నారు. దీనికి సంబంధించి 11 మిల్లులు మినహా అన్ని మిల్లులు సార్టెక్స్ పోర్టిఫైడ్ అర్హత కలిగినవే. దీంతో ఎప్పుడు సేకరించిన ధాన్యంను అప్పుడే మిల్లులకు తరలించేందుకు సన్నద్ధం చేశారు.

ఈ ఏడాది వరినాట్లు తక్కువగా పడ్డాయి. ఈ ఖరీఫ్‌లో దాదాపు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమైంది. డిసెంబర్‌లో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కొన్ని చోట్ల పంట తడిచింది. ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం చెప్పడంతో వాటిని కూడా కొనుగోలు చేస్తున్నారు. రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయిస్తున్నారు. వారికి వారం రోజుల్లోనే బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. దీని కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను తయారు చేసింది. దీని ద్వారా ధాన్యం కొనుగోలు తర్వాత ఆన్‌లైన్‌లో బిల్లు జనరేట్ అయిన వారం రోజుల్లో రైతుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. ఇప్పటికే రైతులకు రూ.42 కోట్ల మేర ధాన్యం నగదు చెల్లించారు.

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం సంచులను సిద్ధంగా ఉంచారు. ఒక వేళ రైతులు ఆ గోనెలను ఏర్పాటు చేసుకుంటే వాటికి రైతుకు గోను ఒకటి (80కిలోలు)కి రూ.రూ.6.78 ఇచ్చేస్తున్నారు. అలాగే కళ్లంలో ధాన్యం బస్తాలు ఎత్తడానికి ప్రభుత్వం కూలీలను ఏర్పాటు చేస్తోంది. వారు అందుబాటులో లేకపోతే రైతులే ఆ పనులు చేసుకుంటే ఆ డబ్బులు కూడా ఒక క్వింటాకు రూ.17.17 చెల్లిస్తోంది. దీని వల్ల దళారీల బెడద తగ్గింది. రవాణా చార్జీలు కూడా పూర్తిగా ఈ ఏడాది ప్రభుత్వమే భరిస్తోంది. ఒక వేళ రవాణాకు రైతులు వాహనాలు ఏర్పాటు చేసుకుంటే రవాణా చార్జీలు కూడా దూరాన్ని బట్టి చెల్లిస్తారు.

కొనుగోళ్లు ప్రారంభం

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ధాన్యంను 626 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టారు. వీటిలో ఇప్పటికే 226 కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే సుమారుగా 30,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వీటిని 5,532 మంది రైతులు విక్రయించారు. వారికి రూ.60.92 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే వీరికి రూ.42.07 కోట్లను వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ధాన్యం విక్రయాల్లో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేసేందుకు కంట్రోల్ రూమ్‌లు నిర్వహిస్తున్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1902, 15525ను సంప్రదించాలని అధికారులు తెలిపారు. జిల్లాలో జాయింట్ కలెక్టర్ ధాన్యం కొనుగోలు బాధ్యతలు చూస్తున్నారు. సమస్యలు ఉన్నవారు జేసీని సంప్రదించవచ్చు.

‘అన్ని అంగన్‌వాడీలు తెరవాల్సిందే’


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గర్భిణులు, బాలింతలు, శిశు రక్షణకు మానవత్వంతో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. అంగన్‌వాడీల సమ్మె కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేస్తే కుదరదని, వందశాతం అంగన్‌వాడీలు తెరవాలని ఆయన తెలిపారు. అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సీడీపీఓలతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి జిల్లాలో 3358 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను 58 శాతం కేంద్రాలు మాత్రమే తెరుచుకున్నాయని, రాష్ట్ర సగటులో ఇది చాలా తక్కువని, బుధవారం నాటికి వంద శాతం కేంద్రాలు తెరుచుకునేలా సంబంధిత యంత్రాంగం పనిచేయాలని స్పష్టం చేశారు. నందిగాం మండలంలో ఒక కేంద్రం కూడా తెరుచుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రణస్థలం, జి.సిగడాం, లావేరు, గార మండలాలలో వంద శాతం కేంద్రాలను ప్రారంభించిన యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. రాజీ మార్గంలో మాట్లాడి కేంద్రాలు తెరుచుకునేలా ప్రయత్నించాలని, కానిపక్షంలో బలవంతంగానైనా తాళాలు తెరవాల్సిందేనని, వీఆర్వోల సమక్షంలో పంచనామా నిర్వహించాలని సూచించారు. ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం సీడీపీఓల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇచ్ఛాపురం చేరుకున్న ‘ప్రజా చైతన్య యాత్ర’

ఇచ్ఛాపురం రూరల్:

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారం దక్కించుకోవాలని కోరుతూ ఓ అభిమాని చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఇచ్ఛాపురం చేరుకుంది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామానికి చెందిన కావూరి జయకు మార్ సెప్టెంబర్ 12న ఇడుపులపాయలో ప్రారంభించిన ప్రజా చైతన్య యాత్ర 26 జిల్లాల్లో పర్యటిస్తూ 99వ రోజు మంగళవారం లొద్దపుట్టి విజయ స్థూపం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో అంబేడ్కర్ ఆశించిన పాలన జరుగుతోందని, రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపడితే బడు గు, బలహీన వర్గాల భవిష్యత్‌కు భరోసా దొరుకు తుందన్న ఉద్దేశంతో ప్రజలను చైతన్య పరుస్తూ యాత్ర చేశానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పైలాన్ వద్ద స్థానికులను కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు.


విజయ స్థూపం వద్ద ప్రజా చైతన్యయాత్ర ద్వారా ప్రచారం చేస్తున్న కావూరి జయకుమార్

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఫలితాలు వెల్లడించడం నేరమని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం గర్భస్థ పూర్వ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ సలహా మండలి సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సలహా మండలి సమావేశాలు డివిజన్ స్థాయిలో నిర్వహించాలన్నారు. తక్కువ జనాలు ఉన్న మండలాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఒక 3 నెలల కాలపరిధిలో రిజిస్ట్రేషన్, అబార్షన్, డెలివరీలు పరిశీలించి కారణాలు పరిశీలించాలని తెలిపారు. స్కానింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బాల బాలికలు ఇద్దరూ సమానమేనని ప్రతి ఒక్కరూ గ్రహించాలని చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ బాలికల జననాలు తగ్గుతున్నాయని తెలిపారు. జిల్లాలో 107 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిని సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రతి గర్భిణికి అంగన్‌వాడీలతో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ తిప్పేస్వామి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డిఐఓ ఈశ్వరీ దేవి, లీగల్ ఎక్స్పెక్ట్ డి.సరళ కుమారి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకట రమణ, డిప్యూటీ డెమో వెంకటేశ్వర రావు, పీసీపీఎన్‌డీటీ కోఆర్డినేటర్ సూర్యకళ పాల్గొన్నారు.

కాలేజీ విద్యార్థులకు పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, తదితర పోటీలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషుల శ్రీకాకుళంలో ఉదయం పది గంటలకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9491616319 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రుణాలు మంజూరు చేయాలి: కలెక్టర్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని రైతులు, మహిళలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన బ్యాంకర్లతో 2023-24 ద్వితీయ త్రైమాసిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు నాటికి రైతులు, కౌలు రైతులకు రుణాలు మంజూరులో లక్ష్యాలు చేరుకోకపోవడం శోచనీయమన్నారు. రైతులకు రుణాలు ఆపవద్దని బ్యాంకర్లను ఆదేశించడమే కాక బ్యాంకుల వారీగా ఉన్న లక్ష్యాలను తెలియజేయాలని సంబంధిత జిల్లా అధికారులు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరును ఆదేశించి కౌలు రైతులకు రుణాలు అందేలా చూడాలన్నారు. ఎంఎస్ఎంఈలో లక్ష్యాలు, టిడ్కో, విద్యా రుణాలు తదితర అంశాలపై ఆరా తీశారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో రుణాలకు వస్తే రుణాలు మంజూరు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రచారం చేస్తున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ జేడీ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకర్లు రుణాలు త్వరగా మంజూరు చేయడం లేదని చెప్పగా సంబంధిత బ్యాంకు అధికారి మాట్లాడుతూ కొంతమంది రైతులు రుణాలు తిరిగి చెల్లించడం లేదని తదితర సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.

క్రీడలతో ఆరోగ్యం, ఉల్లాసం


కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో భాగంగా బెలూన్స్ వదులుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- రాష్ట్రస్థాయి మహిళల ఆహ్వానపు కబడ్డీ పోటీలు ప్రారంభం

విజయనగరం: పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించి మొదటిస్థానంలో నిలవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆకాంక్షించారు. క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం వస్తుందని హితవు పలికారు. ముఖ్యంగా మహిళలకు ఫిట్‌నెస్ చాలా అవసరమని, అందుకోసం వ్యాయామం చేయాలని, అప్పుడప్పుడూ క్రీడలు ఆడుతూ ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో, కార్పొరేషన్ మహిళా విభాగం సారథ్యంలో మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. నగరంలోని మహిళా పార్కులో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది జట్లు తలపడనున్నాయి.

క్రీడలతో మానసిక దృఢత్వం

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటల వల్ల క్రీడా స్ఫూర్తితో పాటు వినోదం కూడా కలుగుతుందని, మానసికంగా దృఢంగా ఉండడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. 15 ఏళ్ల పైబడిన వారంతా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అన్ని రకాల క్రీడలను మహిళలు ఆడాలని పిలుపునిచ్చారు. మహిళా పార్కులో మహిళల వ్యాయామం కోసం అనేక రకాల పరికరాలను కార్పొరేషన్ వారు ఏర్పాటు చేశారన్నారు. నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కబడ్డీ పోటీలలో పాల్గొనేందుకు 8 జిల్లాల నుంచి మహిళలు విచ్చేశారని తెలిపారు . ఈ పోటీలలో మొదటి బహుమతిగా రూ.50వేలు, 2వ బహుమతి రూ.40 వేలు, 3వ బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ అస్మా ఫరీన్, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ శశిభార్గవి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు

ప్రాణదాత


పాట్నూరు రాజేశ్వరరావు

- నాల్గోసారి అవయవదానానికి వేదికగా జెమ్స్ ఆస్పత్రి
- బ్రెయిన్ డెడ్ వ్యక్తి నుంచి అవయవాల సేకరణ
- ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా గుండె తరలింపు
- ఘనంగా నివాళులర్పించిన ఆస్పత్రి యాజమాన్యం

శ్రీకాకుళం రూరల్: సమాజంలో వస్తున్న కీలకమైన మార్పులకు జిల్లా సాక్ష్యంగా నిలుస్తోంది. ఒకప్పుడు అవయవదానంపై ఊరూరా తిరిగి అవగాహన కల్పించినా ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. కిరణ్‌చంద్ అనే విద్యార్థితో మొదలైన ఈ ప్రాణ దాన క్రతువు ఇప్పుడు పాట్నూరు రాజేశ్వరరావు వరకు దిగ్విజయంగా సాగింది. రాగోలు జెమ్స్ ఆస్పత్రి మరోమారు అవయవదాన కార్యక్రమానికి వేదికగా నిలిచింది. అనారోగ్యంతో బాధ పడుతూ బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించిన పాట్నూరు రాజేశ్వరరావు(52) అనే వ్యక్తి నుంచి మంగళవారం అవయవాలు సేకరించి అత్యవసర స్థితిలో ఉన్న వారికి ఆగమేఘాలపై అందజేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

టెక్కలి మండలం రావివలస గ్రామానికి చెందిన పాట్నూరు రాజేశ్వరరావు (52) కిరాణా వ్యాపారం చేస్తుండేవారు. కొద్ది రోజుల కిందట ఈయనకు బీపీ ఎక్కువై కళ్లు తిరగడం ప్రారంభమైంది. దీంతో ఆయనను జెమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. అయితే ఆస్పత్రిలో చేరిన కొన్నాళ్లకు ఆయనకు బ్రెయిన్ డెడ్ అయిపోయింది. ఆపరేషన్ చేసినా ఫలితం ఉండదని, మెదడులో నరాలు చిట్లిపోయి రక్తస్రావమవుతోందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో జీవన్‌దాన్ ప్రతినిధులు, వైద్యులు అవయవదానం గురించి రాజేశ్వరరావు కుటుంబ సభ్యులకు వివరించారు. అంత విషాదంలోనూ కుటుంబ సభ్యులు రాజేశ్వరరావు అవయవాలు దానం చేయడానికి ఒప్పుకున్నారు. దీంతో అవయవాలను తరలించే ప్రక్రియకు మంగళవారం శ్రీకారం చుట్టారు.

ఆగ‘మేఘాలపై’..

అవయవదానం గురించి తెలుసుకున్న సీఎం క్యాంపు కార్యాలయం సిబ్బంది శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయాన్ని, ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించారు. గుండెను తిరుపతిలోని స్విమ్స్‌కు అత్యంత వేగంగా తరలించేందుకు హెలీకాప్టర్ ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమయ్యారు. దీనికి సంబంధించి శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు హెలీకాప్టర్ ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలించి అంతా సిద్ధం చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ నుంచి వచ్చిన హెలీకాప్టర్ జెమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ల్యాండ్ అయ్యింది. అప్పటికే గుండె తరలింపు కోసం అన్నీ సిద్ధం చేసిన ఆస్పత్రి సిబ్బంది గుండెను ఫ్రీజర్‌లో భద్రపరిచి హెలీకాప్టర్ ఎక్కించారు. 3.45 ఇక్కడ నుంచి హెలీకాప్టర్ తిరుపతి బయల్దేరింది. గుండెను తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా, లివర్‌ను విశాఖపట్నంలోని పినాకిల్‌కు ఆంబులెన్స్ ద్వారా తరలించారు. కళ్లను రెడ్‌క్రాస్‌కు అందజేశారు. అవయవదానం సందర్భంగా రాజేశ్వరరావు పార్థివ దేహానికి జెమ్స్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.


గుండె ఉన్న ఫ్రీజర్‌ను తీసుకెళ్తున్న వైద్యులు

నలుగురిలో చూసుకుంటాం

తన భర్త రాజేశ్వరరావుకు చెందిన అవయవాలు నలుగురికి ఉపయోగపడితే అదే తమకు సంతృప్తి ఇస్తుందని భార్య నిర్మల అన్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వృత్తిరీత్యా వీరు వ్యాపారం చేస్తున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ సుధీర్, అడిషినల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, క్రిటికల్ కేర్ యూనిట్ వైద్యులు శివన్వేష్, మేనేజర్ బి జోత్స్న, ఆర్ఎంఓలు ప్రవీణ్‌కుమార్, బాలమురళీలు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు



అవయవదానానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇదే ఏడాది ఏప్రిల్‌లో మృతిచెందిన విద్యార్థి కిరణ్‌చంద్‌తో మొదలైన అవయవదానం ప్రక్రియపై అందరికీ అవగాహన కలిగింది. నవంబర్ 26న వీఆర్వో బి.మౌనిక రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురైంది. ఆమె కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. డిసెంబర్ 13న పి.వెంకట్‌నాయుడు, డిసెంబర్ 19న పాట్నూరు రాజేశ్వరావులు బ్రెయిన్‌డెడ్‌కు గురి కావడంతో వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో వారి అవయవాలు మరో నలుగురికి అమర్చి బతికించారు.

– డాక్టర్ సుధీర్, జెమ్స్


జీవన్‌ధాన్ సంస్థ ద్వారా సర్టిఫికెట్‌ను అందజేస్తున్న దృశ్యం


అవయవాలను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తూ..


గుండె తరలింపు కోసం వచ్చిన హెలీకాప్టర్